క్లుప్తంగా

ఉచితంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ


మట్టి వినాయక ప్రతిమలు అందిస్తున్న అధికారులు, జైకిసాన్ ఫౌండేషన్ సభ్యులు

ఉరవకొండ: మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేసు తెలిపారు. స్థానిక జైకిసాన్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద మంగళవారం ఆదర్శ దంపతులు పవన్‌కుమార్, సుమలత వారి కవల పిల్లల జన్మదినం సందర్భంగా తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ రవిప్రసాద్, ఈఓ గౌస్‌సాహెబ్, ఏఓ రామకృష్ణుడు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రజినికుమారి, లావణ్య, మానస్వి, అక్రాంత్, రుషి, అక్షిత పాల్గొన్నారు.

మట్టి గణనాథులను పూజిద్దాం

బెళుగుప్ప: మట్టి గణనాథుల ప్రతిమలను పూజిద్దాం... పర్యావరణాన్ని కాపాడుకుందాం అని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక సన్‌రైజ్ పాఠశాలలో మట్టి గణనాథులు పంపిణీ కార్యక్రమం జరిగింది. కరస్పాండెంట్ మారెన్న,విశ్రాంత ఉపాధ్యాయులు పర్వతన్న, నాగరాజు పాల్గొన్నారు.

పంట సాగులో మెలకువలు పాటించాలి


'పొలం పిలుస్తోంది' నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ రూరల్: పంట సాగులో ప్రతి రైతూ మెలకువలు పాటించాలని వ్యవసాయాధికారి రామకృష్ణుడు తెలిపారు. మంగళవారం బూదగవి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ పరిధిలో సాగు చేసిన ఆముదం పంటను పరిశీలించి, సస్యరక్షణ చర్యలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'

విడపనకల్లు: హంచనహాళ్ గ్రామంలో వ్యవసాయాధికారి పెన్నయ్య ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కంది,సజ్జ తదితర పంటలను పరిశీలించారు. 35 నుంచి 60 రోజుల మధ్యలో సూక్ష్మ పోషకాలు,ఇనుము లోపమునకు నివారణకు ఫెర్రస్ సల్ఫేట్ 3 గ్రాములు, లీటరు నీటిలో కలుపుకొని పంటలకు పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు 20 కేజీలు యూరియా సాళ్ల మధ్య చల్లితే ప్రయోజనం ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ఏఈఓ కైలాస్, వీఏఏ లక్ష్మన్న, రైతులు పాల్గొన్నారు.

కంది పంట పరిశీలన


తెగుళ్ల నివారణకు సూచనలిస్తున్న ఏఓ శుభకర్

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: ఖరీఫ్‌లో సాగైన కంది పంటకు తుఫాన్ ప్రభావంతో తెగులు సోకాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ' కంది పంటకు తుఫాన్ దెబ్బ' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైంది. స్పందించిన ఏఓ శుభకర్ మంగళవారం చోళసముద్రం, కొర్రకోడులో కంది పంటను పరిశీలించారు. ఎండు తెగులు నివారణకు ఒక లీటర్ నీటికి 3 గ్రాములు కాపరాక్సీ క్లోరైడ్ లేదా కార్బన్‌డిజం 1 గ్రాము లేదా ట్రిబుయకోజోనల్ 1 ఎంఎల్ కలిపి పిచి కారీ చేయాలని సూచించారు. పచ్చ పురుగు నివారణకు ఒక లీటర్ నీటికి 2 ఎంఎల్ డైమిథియేట్ కలిపి పిచికారీ చేయాలని చేయాలని రైతులకు తెలియజేశారు.

దోమల నివారణకు చర్యలు

కూడేరు: కూడేరులోని రామాలయం వద్ద ప్రధాన రోడ్లకు ఏర్పాటు చేసిన డ్రైనేజీలను పంచాయతీ సిబ్బంది శుభ్రం చేయించారు. 'రోడ్డుపై మురుగు..సమస్య తీరేదెన్నడు.?' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైంది. దీనికి పంచాయతీ అధికారులు స్పందించారు. మురుగు నీటిలో దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఇళ్ల ముందు రోడ్లపై మురుగు సమస్య తీరింది.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి


ఎఫ్ఏ రాజశేఖర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పీడీ సలీంబాషా, అధికారులు

కూడేరు: ఉదిరిపికొండ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్ (35) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. డ్వామా పీడీ సలీం బాషా, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఏపీఓ పోలేరయ్య, సిబ్బంది రాజశేఖర్ మృతదేహానికి మంగళవారం నివాళులర్పించారు.

వచ్చాడయ్యో.. విఘ్ననాయకుడు

- వీధివీధినా గణేష్ మంటపాలు
- నేడు వివిధ రూపాల్లో కొలువుదీరనున్న వినాయకుడు
- విగ్రహాలు, సామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడిన మార్కెట్లు


బొలెరోలో వినాయక విగ్రహాన్ని మంటపానికి తీసుకెళ్తున్న యువకులు


రాయదుర్గంలోని బళ్లారి రోడ్డులో విద్యుత్ వెలుగుల్లో ఉత్సవానికి సిద్ధం చేసిన మంటపం వద్ద స్వాగత తోరణం

రాయదుర్గంటౌన్: వినాయక చవితి సందడి మంగళవారం మొదలైంది. సర్వ విఘ్నాలు తొలగించే వినాయకుడి తొలి పూజకు ఊరూవాడా.. సిద్ధమైంది. వీధి వీధినా మంటపాలు వెలిశాయి. విద్యుత్ వెలుగులతో ముస్తాబయ్యాయి. వినాయక ప్రతిమలు ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎక్కడ చూసినా చవితి సందడి నెలకొంది. ఇంట్లో పూజ కోసం బొజ్జగణపయ్యల విగ్రహాలను సిద్ధంగా ఉంచడంతో కొనుగోలుదారులతో మార్కెట్లు, ప్రధాన వీధులు కిక్కిరిశాయి. ఉత్సాహంగా ప్రత్యేక వాహనాలు, ట్రాక్టర్లు, ఆటోల్లో వినాయక ప్రతిమలు మంటపాలకు తరలిస్తున్నారు. రాయదుర్గంలోని వినాయక సర్కిల్, మొలకాల్మూరు రోడ్డు, బళ్లారి రోడ్డు, పాత బస్టాండ్, మార్కెట్ ఏరియాల్లో జనం పండుగ సామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడింది. కాగా పండుగ పూజా సామగ్రి ధరలు, వినాయక ప్రతిమల ధరలు ఆకాశాన్నంటాయి. రాయదుర్గం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో దాదాపు 70కిపైగా మంటపాలు ఏర్పాటుకు అనుమతులు పొందినట్లు పోలీసులు తెలిపారు.

వినాయక చవితికి మంటపాలు ముస్తాబు

కూడేరు: మండల వ్యాప్తంగా ప్రజలు వినాయక చవితికి ఏర్పాట్లు చేశారు. వాడవాడలా విగ్రహాల ఏర్పాటుకు మంటపాలు సిద్ధమయ్యాయి. జిల్లా కేంద్రం అనంతపురం, సిండికేట్ నగర్ నుంచి వినాయక విగ్రహాలను ట్రాక్టర్ బొలేరో, ఐచర్ వాహనాల్లో తరలించారు. బుధవారం వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

చవితి వేడుకలకు ముస్తాబైన విఘ్నేశ్వరాలయం

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో బుధవారం నుంచి వినాయక చవితిని పురస్కరించుకొని వినాయక ఆలయాలతో పాటు వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక మంటపాలు ఏర్పాటు చేశారు. బెళుగుప్పలోని వినాయకనగర్‌లోని విఘ్నేశ్వరాలయాన్ని విద్యుత్ దీపకాంతులతో ముస్తాబు చేశారు. ఆలయంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు వేడుకలు నిర్వహించనున్నారు. గురువారం వినాయక చవితి పూజలు రజత కవచ అలంకారంలో స్వామి దివ్య దర్శనం, శుక్రవారం ప్రత్యేక అభిషేక పూజలు, మధ్యాహ్నం అన్న సంతర్పణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. స్వామి లడ్డూ ప్రసాద వేలం పాట అనంతరం ప్రతిమ ఊరేగింపుతో నిమజ్జనం ఉంటుందన్నారు.

మంటపాల ఏర్పాట్లలో ప్రజల బిజీ

బొమ్మనహాళ్: కులమతాలకతీతంగా పిల్లలు, పెద్దలు వినాయక చవితి పండుగను జరుపుకునేందుకు గ్రామాల్లో సన్నాహాలు మొదలయ్యాయి. ఇప్పటికే పండుగ వాతావరణం నెలకొంది. బొమ్మనహాళ్ మండలంలోని గ్రామాల్లో నిర్వాహకులు వినాయకులను కొలువుదీర్చేందుకు మంటపాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం వినాయకుని విగ్రహాల నిమజ్జనం చేయనున్నారు.


బెళుగుప్ప విఘ్నేశ్వరాలయంలో స్వామి మూలవిరాట్


వినాయక ప్రతిమను ట్రాక్టర్‌పైకి తరలిస్తున్న దృశ్యం

పూజా ద్రవ్యం..మరింత ప్రియం

- ఊరూవాడా వినాయకచవితి శోభ
- చుక్కలనంటుతున్న పూజా సామగ్రి ధరలు
- కొనలేక.. ఉండలేక అవస్థలు పడిన సామాన్యులు

ఉరవకొండ: వినాయకుడు విఘ్నాలు తొలగించే దేవుడు..అందుకే ఏ శుభకార్యం మొదలు పెట్టినా ముందుగా 'వక్రతుండ మహాకాయ' అని ఆయన్ను ప్రార్థిస్తారు. ఇంతటి విశిష్టత కలిగిన వినాయక చవితి పండుగను ప్రతి ఇంటా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఇంట్లో బుల్లి వినాయకుడిని కొలువు దీర్చి .. పూజా సామగ్రి కొనుగోలు చేసి..పూజ చేస్తే కోరికలు సిద్ధిస్తాయని ప్రతి ఒక్కరిలో నమ్మకం. పండుగకు పూజా సామగ్రి, పండ్లు కొనుగోలు చేయాలని మార్కెట్‌కు వెళ్తే ధరలు మరింత ప్రియంగా ఉన్నాయి. సామాన్యులు కొనుగోలు చేయలేక.. ఉండలేక అవస్థలు పడ్డారు.


మార్కెట్లో బంతి, చామంతి పూల విక్రయాలు


చెరకు గెడలు విక్రయిస్తున్న దృశ్యం

మార్కెట్లో ధరలు ఇలా

- బంతి, చామంతి ఇతర పూలు కేజీ–రూ.450 –500
- నారింజ, దానిమ్మ కేజీ రూ.180 నుంచి రూ.200
- అరటిపండ్లు డజను రూ. 50 నుంచి రూ.80
- చెరకు గెడలు రెండు రూ. 100 నుంచి రూ.150
- అరటి బోదెలు రెండు రూ.100 నుంచి రూ.150
- మామిడి ఆకు రూ.100 నుంచి రూ.120

దీంతో పాటు స్వామికి నైవేద్యంగా ఉంచే ఉండ్రాళ్లు, కుడుములు, పాయసం, అటుకులు, కొబ్బరి, బెల్లం లాంటివి ఎన్నో తయారు చేసి పెడుతారు. వీటిని కొనుగోలు చేయాలంటే మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

పండుగ అంటే పెంచేస్తున్నారు



చవితి వచ్చిందంటే ప్రతి ఇంటా సందడే ఉంటుంది. అయితే సాధారణ రోజుల కంటే పండుగ రోజుల్లో పూజా సామగ్రి ధరలు మరింత పెంచేస్తున్నారు. సామాన్య ప్రజలు మార్కెట్‌లో ధరలు చూసి కొనుగోలు చేయడానికి భయపడే పరిస్థితి.

– గౌతమి, గృహిణి, ఉరవకొండ

ధరలు ఎక్కువగా ఉన్నాయి



వినాయకుడి ఉంచే పండ్లు, చెరకు గెడలు, మామిడి పాదలు, అరటి ఆకులు ఇలా ప్రతి ఒక్కటి రెండింతల ధరలు చెబుతున్నారు. చామంతి, బంతి పూల ధరలు 500 కేజీ చెబుతున్నారు. స్వామికి పూలు లేకుండా ఎలా పూజిస్తారు.

– జానకి, గృహిణి, ఉరవకొండ


విఘ్నాలు తొలగి విజయాలు సిద్ధించాలి

ఉరవకొండ: వినాయక చవితి పర్వదినం సందర్భంగా విఘ్ననాయకుని అనుగ్రహం తప్పనిసరిగా ఉండాలని, విఘ్నాలు తొలగి, విజయాలు సిద్ధించాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం ఉరవకొండ నియోజకవర్గ ప్రజలందరికీ ఓ ప్రకటనలో వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలను పూజించి, పండుగ సంప్రదాయాన్ని ప్రజలంతా పాటించాలని కోరారు.

ఉరవకొండ: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, అందరికీ శుభాలు కలగాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు ఆయన మంగళవారం ఓ ప్రకటనలో వినాయక చవితి శుభకాంక్షలు తెలియజేశారు. సకాలంలో వర్షాలు, పాడి పంటలు సమృద్ధిగా చేతికందాలని, పండించిన పంటకు గిట్టుబాటు ధర అందాలని కోరుకున్నారు.

కళ్యాణదుర్గం: వినాయక చవితి సందర్భంగా జిల్లా, నియోజకవర్గ ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ, పీఏసీ సభ్యుడు, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గ ప్రజలతో పాటు జిల్లా ప్రజలకు విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో విఘ్నాలు తొలగిపోయి, విజయాలు కలగాలని ఆకాంక్షించారు.


విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే


ఎమ్మెల్సీ శివరామిరెడ్డి


తలారి రంగయ్య, మాజీ ఎంపీ

చవితి ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి


ఉత్సవ నిర్వాహకులతో సమావేశమైన చైర్‌పర్సన్ శిల్ప, అధికారులు

రాయదుర్గంటౌన్: వినాయక విగ్రహాలు, మంటపాల ఏర్పాటు, వినాయక నిమజ్జనోత్సవంలో నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన ఉత్సవ నిర్వాహకులు, వినాయక ఉత్సవ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ నాగరాజు, అర్బన్ సీఐ జయనాయక్ మాట్లాడారు. వినాయక విగ్రహాల ప్రతిష్ఠకు నిర్వాహకులు సింగిల్ విండో విధానంలో అనుమతులను ఆన్‌లైన్‌లో పొందాలన్నారు. వినాయక నిమజ్జన ప్రాంతాలు నిర్ణయించామని, రాయదుర్గంలో చిన్నపాటి విగ్రహాల నిమజ్జనానికి మొలకాల్మూరు చెక్‌పోస్టు వద్దనున్న నాస్ చెరువులో ఏర్పాటు చేశామన్నారు. భారీ సైజు విగ్రహాలను కణేకల్లులోని కెనాల్‌కు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, వార్డు ఇన్‌చార్జ్ గౌని శ్రీరామిరెడ్డి పాల్గొన్నారు.

వినాయకచవితి శుభాకాంక్షలు

వినాయక చవితి సందర్భంగా రాయదుర్గం ప్రజలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లకు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప మంగళవారం శుభాకాంక్షలు తెలియజేశారు.

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

విడపనకల్లు: వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ ఖాజాహుస్సేన్ ఉత్సవ నిర్వహకులను ఆదేశించారు. మంగళవారం విడపనకల్లులో వినాయక విగ్రహం ప్రతిష్ఠించి, మంటపం వద్ద సమావేశం నిర్వహించారు. విగ్రహాలు ఊరేగించే సమయంలో ఎక్కడా ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ సత్యం, పోలీసు సిబ్బంది, వినాయక చవితి నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తూతూమంత్రంగా తనిఖీలు


కుందుర్పిలో ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

కుందుర్పి: మండల కేంద్రంలో మంగళవారం ఎరువుల దుకాణాల్లో అధికారులు తనిఖీ చేశారు. యూరియాను అధిక ధరలతో విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ అధికారులు తనిఖీ చేశారు. అయితే అధికారులు తూతూమంత్రంగా ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారని, యూరియా ఉన్న గోడ్లను తనిఖీ చేయలేదని వైఎస్సార్‌సీపీ రైతు సంఘం నాయకులు పెద్దప్పయ్య, వన్నూర్‌రెడ్డి, తిప్పేస్వామి, బొమ్మయ్య తదితరులు విమర్శించారు. ఇటీవల వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ దుకాణంలో అక్రమంగా ఎరువులు విక్రయిస్తున్నట్లు తెలిసి రూ.6లక్షల విలువ చేసే నకిలీ ఎరువులను ఏడీఏ యల్లప్ప దుకాణాన్ని సీజ్ చేశారు. అయితే అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో రాత్రికి రాత్రే ఎరువుల విక్రయానికి అనుమతి ఇచ్చినట్లు రైతులు చర్చించుకుంటున్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ ఓబుళపతి, కంబదూరు ఏఓ మహేష్, కుందుర్పి ఏఎస్ఐ రమేష్, ఏఈఓలు విజయ్ కుమార్, కులశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

కూడేరు: ఎరువులు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ మహబూబ్ బాషా, ఏఓ శుభకర్ ఎరువుల దుకాణదారులను హెచ్చరించారు. మంగళవారం కూడేరులోని లక్ష్మీవెంకటేశ్వర, శ్రీనివాస ఫెర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. ఎరువుల కొరతను సృష్టించి, రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని తెలియజేశారు.

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు గ్రామంలో ఏఓ పెన్నయ్య ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులను మంగళవారం తనిఖీ చేశారు. శ్రీరాం ట్రేడర్స్, మల్లేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేసి, స్టాక్‌ను పరిశీలించారు. యూరియా, కాంప్లెక్స్, డీఏపీ బస్తాల స్టాకును పరిశీలించి, ప్రతి రైతుకూ యూరియా రెండుబస్తాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. యూరియా కొరత లేకుండా చూస్తామని, రైతు సేవా కేంద్రాల్లో యూరియా నిలువ ఉంచే విధంగా ఏర్పాటు చేస్తామని ఏఓ తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు, ఫెర్టిలైజర్ షాపు యజమానులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని పేకాట స్థావరంపై స్థానిక పోలీసులు మంగళవారం దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరికొందరు పరారయ్యారు. వారి నుంచి రూ.13,300 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

కూడేరు: కూడేరులో స్టేట్ బ్యాంక్ ముందు ఉన్న పెద్దమ్మ ఆలయంలోని హుండీని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగల గొట్టి, అందులోని నగదు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం పూజారి చోరీ విషయాన్ని గుర్తించాడు.

సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడిగా సంజీవప్ప

కళ్యాణదుర్గం రూరల్: సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడిగా కళ్యాణదుర్గానికి చెందిన ప్రముఖ న్యాయవాది, సీపీఐ సీనియర్ నేత సంజీవప్ప ఎంపికయ్యారు. మాజీ ఎమ్మెల్సీ జెల్లీ విల్సన్ చైర్మన్‌గా 9మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కమిటీలో కళ్యాణదుర్గం నుంచి రెండోసారి పార్టీ రాష్ట్ర కంట్రోల్‌గా సంజీవప్పను ఎంపిక చేశారు.

అంగరంగ వైభవంగా దుగ్గిలమ్మ జాతర



పూజలందుకున్న దుగ్గిలమ్మ అమ్మవారు, ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 17వ వార్డులో వెలసిన భక్తుల ఇలవేల్పు దుగ్గిలమ్మ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి దర్శనం, మొక్కులు తీర్చుకునేందుకు ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భారీ సంఖ్యలో భక్తుల రద్దీ కొనసాగింది. రాయదుర్గంతోపాటు పరిసర గ్రామాలు, సరిహద్దునున్న కర్ణాటకలోని ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేపాకు చుట్టుకొని మహిళలు, పెద్దలు, పిల్లలు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అమ్మవారికి ఒడిబియ్యం, చెక్కర, ఆకు పూజలు, కొబ్బరి సమర్పించారు. జంతుబలి ఇచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. సీఐ జయనాయక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నేడు మూడుచోట్ల సిడిమాను ఉత్సవం:

దుగ్గిలమ్మ జాతర మరుసటి రోజు రాయదుర్గంలోని ఫైర్‌స్టేషన్ వద్దనున్న కోట మారెమ్మ ఆలయం వద్ద సిడిమాను ఉత్సవం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా బుధవారం అక్కడ సిడిమాను ఉత్సవం జరగనుంది. సాయంత్రం జరిగే ఉత్సవానికి పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. నేసేపేటలోని పెద్ద మారెమ్మ, దండు మారెమ్మ ఆలయాల వద్ద కూడా సిడి మాను ఉత్సవం నిర్వహించనున్నారు.

వైభవంగా మారెమ్మదేవి ఉత్సవం


బోనాలతో ఊరేగుతున్న మహిళలు




సిరిగేదొడ్డి, ఉరవకొండలో అలంకరణలో మారెమ్మదేవత, బెళుగుప్పలో గౌరసంద్ర మారెమ్మ ప్రభ ఊరేగింపు

గుమ్మఘట్ట: ఆంధ్రా సరిహద్దున ఉన్న కర్ణాటకలోని గౌరసముద్రం గ్రామ సమీపంలో వెలసిన మారెమ్మ దేవత ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను తుమ్మల వద్దకు చేరుకోగానే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పోటీపడ్డారు.

ఘనంగా మారెమ్మ దేవతా ఉత్సవాలు

మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో వెలసిన మారెమ్మ దేవత ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మారెమ్మ దేవతకు అలంకరించి, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వేపాకు చీరలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయం ముందు జంతుబలి ఇచ్చారు.

కుందుర్పి: మండల కేంద్రంలో మంగళవారం మారెమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, గ్రామోత్సవం, మధ్యాహ్నం గ్రామ శాంతి, ఊరేగింపు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

బ్రహ్మసముద్రం: రాయలదొడ్డి, కన్నేపల్లి, బ్రహ్మసముద్రం, బైరసముద్రం, వేపులపర్తి, పడమటి కోడిపల్లి గ్రామాల్లో మారెమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో గ్రామస్తులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆకుపూజ, వేపాకు మాలలు, బోనాలతో ఊరేగింపుగా వెళ్లి జంతుబలి ఇచ్చారు.

ఉరవకొండ: స్థానిక 9వ వార్డులో వెలసిన గౌరసంద్రం మారెమ్మ ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం ఆలయ నిర్వాహకులు వంశరాజుల ప్రతినిధి మారెన్న ఆధ్వర్యంలో భక్తులు పెన్నానది వద్ద గంగాజలాన్ని భారీ ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారిని అభిషేకించారు. అభిషేకం, మహామంగళహారతి, గంగపూజ, ఆకుపూజ చేశారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలోని గౌరసంద్ర మారెమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని భక్తులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి కండోలస్వీకారం, పోతులింగేశ్వర ఆలయం నుంచి ఒడి బియ్యం తెచ్చే కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రభను ఊరేగించారు.

సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గంటౌన్: రాయదుర్గం ఆర్టీసీ డిపోలో నెలకొన్న అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎంయూఏ డిపో సెక్రటరీ హెచ్.తిప్పేస్వామి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం డిపో మేనేజర్ శ్రీనివాసరావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎస్ఎంయూఏ నాయకులు అందజేశారు కార్యక్రమంలో ఎస్ఎంయూ డిపో చైర్మన్ కేఎస్ వలి, చీఫ్ అడ్వైజర్ ఎర్రిస్వామి, వైస్ ప్రెసిడెంట్ గోవిందప్ప, రమణ, గ్యారేజీ కార్యదర్శి జయప్రకాష్, మస్తాన్, సతీష్‌కుమార్, మాలిక్‌బాషా పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి జయంతి


పూజలందుకున్న వీరభద్రస్వామి


వేదవతి హగిరి నుంచి గంగాజలాన్ని ఊరేగింపుతో తీసుకొస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: దుర్గంలో వీరభద్రస్వామి జయంతి వేడుకలు మంగళవారం జరుపుకున్నారు. వీరశైవలింగాయత్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కోటలో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. స్వామికి రుద్రాభిషేకం, మహామంగళహారతి, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద నుంచి స్వామి వారి పల్లకీ ఉత్సవం కోట వీధులు, మొలకాల్మూరు రోడ్డు మీదుగా వినాయక సర్కిల్ వరకు నిర్వహించి, తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు.

కణేకల్లు: కణేకల్లులో వీరభద్రస్వామి జయంత్యుత్సవాలను వీరశైవులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. వీరభద్రస్వామి జయంత్యుత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత వీరశైవులు గ్రామ శివారులోని వేదవతి హగిరి వద్దకెళ్లి గంగిపూజ చేశారు. అనంతరం పవిత్రమైన గంగజలాన్ని ఊరేగింపుతో తీసుకొచ్చారు. వీరభద్రుడి వేషధారుడు చేసిన వీరగాసే నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయంలో స్వామి వారికి వేదవతి హగిరి నుంచి తెచ్చిన గంగాజలంతో అభిషేకం చేశారు. అనంతరం పంచామృతాభిషేకం, మంగళహారతి, మహా మంగళహారతి పూజలు చేశారు.